క్లుప్తంగా

కలాంను ఆదర్శంగా తీసుకోవాలి



కలాం చిత్రపటానికి నివాళి

కుప్పంరూరల్: దివంగత డా.ఏపీజే అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా. సుధాకర్‌బాబు అన్నారు. మంగళవారం అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని కళాశాలలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపల్ భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న సభ్యులు

వి.కోట: స్థానిక గ్రేటర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆ సంస్థ మండలాధ్యక్షుడు ధీరజ్ తెలిపారు. స్థానిక ప్రైవేట్ బస్టాండ్ వద్ద 500 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి దాతృత్వాన్ని చాటుకున్నట్లు చెప్పారు. క్లబ్ సభ్యులు సురేంద్రగౌడ, తుకారం, నాగరాజేంద్ర, సోమశేఖర్, మురుగేష్ పాల్గొన్నారు.

పంచాయతీ పాలనపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న వరప్రసాద్

సదుం: పంచాయతీ పరిపాలనపై ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ వరప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విధులు, సమావేశాల నిర్వహణ, నిధుల వినియోగం, అభివృద్ధి కార్యక్రమాలు వాటిపై శిక్షణ ఇచ్చారు. మెరుగైన పాలన అందించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ తులసీకృష్ణ పాల్గొన్నారు.

సెలవిచ్చినా బడి నడిపారని మండిపాటు

పలమనేరు: పట్టణంలోని ఆదర్శ పాఠశాల కలెక్టర్ ఆదేశించినా తుపాన్‌లో బడిని నడిపారని తల్లిదండ్రులు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కొందరు అక్కడి కరస్పాండెంట్‌ను నిలదీశారు. ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో మీడియాకు సమాచారాన్ని అందించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

వరి పంటపై జాగ్రత్తలు అవసరం

వి.కోట: మండలంలో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించి వరి పంటను కాపాడుకోవాలని మండల ఏఓ రాజ్యలక్ష్మి సూచించారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం వరి పంట పిలకలు పెట్టే దశ, గింజ పాలు పోసుకునే దశలలో, గింజ గట్టిపడే దశల్లో ఉన్నాయి. ఇలాంటి సమయంలో వర్షపు నీరు ఎక్కువగా పొలంలో నిల్వ ఉండకుండా పంట నుంచి బయటకు తీసేయాలన్నారు. అలాగే పంట వాలి పడిపోతే లేపి కట్టలు కట్టాలని సూచించారు. తడిసిన పనలలో మొలకలు రాకుండా 5శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేసుకోవాలి. అదేవిధంగా రాగి పంట ప్రస్తుతం గింజ గట్టిపడే దశలో ఉందని పంట పడిపోతే లేపి కట్టలు కట్టి పంటను కాపాడుకోవాలని ఆమె సూచనలు చేశారు.

వరద బాధితులకు ఆర్థికసాయం



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : విజయవాడ వరద బాధితులకు జిల్లా ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు ఆర్థికసహాయం చేశారు. ఈ మేరకు సంఘ నాయకులు మంగళవారం చెక్కును కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్ మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు తమ సంఘం తరఫున రూ.86,100 చెక్కును అందజేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పేదలను తమ వంతు ఆదుకునేందుకు సేవాభావంతో ముందుకు రావాలన్నారు. డీవైఈఓ చంద్రశేఖర్, సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్రారెడ్డి, కోశాధికారి హేమాద్రి, పాల్గొన్నారు.

రిటైర్డు పోలీస్ వితరణ..

చిత్తూరు అర్బన్: విజయవాడ వరదలతో నిరాశ్రయులుగా ఉన్నవారిని ఆదుకోవడానికి జిల్లా రిటైర్డు పోలీసు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. మంగళవారం చిత్తూరు నగరంలో ఎస్పీ మణికంఠను కలసి రూ.35 వేల చెక్కును అందచేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మురళి, ఫెడ్రిక్ పాల్గొన్నారు.

లక్కున్నా.. కిక్కు దక్కలా!

- మద్యం షాపులు చేజిక్కించుకున్న వారికి తమ్ముళ్ల బెదిరింపులు
- వ్యాపారాలొద్దు వెళ్లిపోవాలంటూ దౌర్జన్యాలు
- షాపులు అప్పగించకుంటే దాడులు తప్పవని హెచ్చరికలు
- పచ్చ సిండికేట్ దెబ్బకు షాపులిచ్చేసిన లైసెన్స్ దారులు



పలమనేరు: మద్యం షాపుల వ్యవహారంలో పచ్చ సిండికేట్ దౌర్జన్యకాండ పలమనేరు నియోజకవర్గంలో ఎక్కువైంది. లాటరీలో షాపులు దక్కిన వైఎస్సార్‌సీపీ, తటస్థుల షాపులను మద్యం సిండికేట్ సామదానదండోపాయాలను ఉపయోగించి పచ్చ సిండికేట్‌కే షాపులు దక్కేలా చేసుకున్నారు. ఇందు కోసం షాపుల దక్కినవారిపై బెదిరింపులు, దాడులు సైతం జరిగాయి. చేసేది లేక నిబంధనల మేరకు షాపులు దక్కించుకున్నవారు సైతం వ్యాపారం చేయలేని పరిస్థితుల్లో విధిలేక షాపులను టీడీపీ వారికి అప్పగించాల్సి వచ్చింది.

ముగ్గురిని బెదిరించి పబ్బం గడుపుకున్నారు...

పలమనేరు ఎక్సైజ్ శాఖ పరిధిలో 13 ప్రైవేటు షాపులకు సంబంధించి పది షాపులు పచ్చ సిండికేట్ దక్కించుకొంది. కాగా గంగవరానికి చెందిన ఓ షాపు పెద్దపంజాణికి చెందిన నగిరేపల్లి క్రిష్టారెడ్డికి దక్కింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే దగ్గరి బంధువైన ఓ నేత ఆయన్ను బెదిరించి షాపు వారికే దక్కేలా అగ్రిమెంట్ రాసుకొని ఆయన కట్టిన డిపాజిట్ డబ్బును మాత్రం వెనిక్కిచ్చేశారని తెలిసింది. ఇక గంగవరం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కల్లు బాలక్రిష్ణ భార్య పేరుతో మూడు డిపాజిట్‌లు కట్టగా ఆయనకు బైరెడ్డిపల్లి షాపు లాటరీలో దక్కింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బంధువు తన ఇంటికి బాలక్రిష్ణను రప్పించి బెదిరించి మరీ షాపును లాక్కున్నాడని బాధితుడు సాక్షికి తెలిపారు. ఆపై బాలక్రిష్ణ ఇంటివద్దకొచ్చిసైతం రూరల్ మండలానికి చెందిన ఓ నేత దాడి చేసి మరీ బలవంతంగా షాపును రాయించుకున్నట్టు ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై తాను న్యాయపోరాటం చేస్తానని బాధితుడు తెలిపారు. మరోవైపు కర్ణాటక రాష్ట్రం నంగిళికి చెందిన దుర్గాప్రసాద్‌కు పట్టణంలో ఓ షాపు దక్కింది. దీంతో అతను షాపునకు సంబంధించి రూ.10.87లక్షలను రెంటల్ చార్జీలుగా ప్రభుత్వానికి చెల్లించాడు. అయితే ఇతనికి స్థానిక టీడీపీ నాయకుల బెదిరింపులతో ప్రస్తుతం అండర్ గ్రౌండ్‌కు వెళ్లాడు. పట్టణంలో నీకు షాపు ఎలా అద్దెకు దక్కుతుంది, నీవు ఎలా వ్యాపారం చేస్తావో చూద్దామంటూ టీడీపీ నేతల బెదిరింపులు అతనికి తప్పలేదు. పలమనేరు రూరల్ మండలం కొలమాసనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత నారాయణ సైతం మూడు షాపులకు డిపాజిట్ చెల్లించగా విషయం తెలుసుకున్న పచ్చ సిండికేట్ అతన్ని బెదిరించి ఆయన చెల్లించిన డబ్బును వెనక్కిచ్చినట్టు తెలిసింది.

భలే మంచి కిక్కుబేరం....

ప్రస్తుతం ఓ మద్యం షాపునకు డిపాజిట్‌గా రూ.2లక్షలు, ఆపై ప్రభుత్వానికి రెంటల్ చార్జీగా రూ.10.87లక్షలు, దుకాణానికి అద్దెగా ఏడాదికి రూ.1.20 లక్షలు, షాపులో సిబ్బందికి రూ.2లక్షలు మొత్తం ఏడాదికి రూ.16లక్షలు పెట్టుబడిగా పెడితే ఏటా కోటి దాకా ఆదాయం ఉంటుందని తెలుస్తోంది. ఇందుకోసం వేరేవాళ్లకు షాపులు పోకుండా పచ్చసిండికేట్ సర్వవిధాలా షాపులను దక్కించుకోవాలనే తలంపుతో ఇతరులకు ఏమాత్రం అవకాశం లేకుండా చేసుకున్నట్టు అర్థమవుతోంది.

రోడ్డు తవ్వేశారు.. పూడ్చడం వదిలేశారు



అధ్వానంగా గోనుగూరు రోడ్డు



వర్షపు నీటితో నిండిన వీధి

- జేజేఎం ద్వారా నీటి కనెక్షన్ నిర్వాకం
- రోడ్డంతా అధ్వానం

కుప్పం: జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ నీటి కనెక్షన్ అందివ్వాలని పథకం నిర్వాకం రోడ్డంతా తవ్వేశారు. పూడ్చడం వదిలేయడంతో పాదచారుల అవస్థలు వర్ణనాతీతం. కుప్పం మండలం గోనుగూరు గ్రామంలో సీసీ రోడ్డు ఇష్టానుసారంగా తవ్వేయడంతో నాలుగు రోజులుగా పడుతున్న వర్షాలతో నీరు నిండి రాకపోకలకు అంతరాయంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో జలజీవన్ మిషన్ ద్వారా గోనుగూరు గ్రామానికి రూ.30 లక్షలు నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు ప్రారంభించి రోడ్డును జేసీబీ యంత్రాలతో తవ్వేశారు. కోట్ల రూపాయల వ్యయంతో వేసిన సిమెంట్ రోడ్డు తవ్వేసి గుంతలమయం చేశారు. నీటి కనెక్షన్ కోసం సీసీ రోడ్డును ధ్వంసం చేసి ప్రజలను ఇబ్బంది పెట్టారు. రెండు నెలలు అవుతున్నా తవ్వేసిన సిమెంట్ రోడ్డును పూడ్చివేయాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తవ్విన గుంతలను పూడ్చకపోగా మట్టిని సైతం తీయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని గ్రామస్తులు అంటున్నారు.

అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

పెద్దపంజాణి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామ పంచాయతీ నిర్వహణలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాత్ర కీలకమైందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ఎంపీడీఓ బాలాజీ, పీఏస్‌లు లత, రెడ్డి ప్రకాష్, హరిబాబు ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు.

ప్రతినెలా 15న గ్యారేజీలకు సెలవు



సమావేశానికి హాజరైన సభ్యులు

పలమనేరు: ఇకపై ప్రతినెలా 15తేదీన పట్టణంలోని గ్యారేజీలకు సెలవుగా ప్రకటిస్తున్నట్లు పట్టణ టూవీలర్ మెకానిక్స్ సంఘం నిర్ణయించింది. ఆమేరకు సంఘ సమావేశం అధ్యక్షుడు సయ్యద్ మహబూబ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ సంఘ నిబంధనలను మెకానిక్‌లు అందరూ తప్పక పాటించాలని సూచించారు. వినియోగదారులకు సకాలంలో వాహనాలను రిపేర్ చేసి ఇవ్వాలన్నారు. నకిలీ స్పేర్‌పార్ట్స్ అమర్చరాదనే పలు నిర్ణయాలను సంఘ సమావేశంలో తీసుకున్నారు. పట్టణంలోని మెకానిక్‌లకు ఆటో గ్యారేజీకి స్థలాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ఇప్పటికే విన్నవించామని తెలిపారు. సంఘ ఉపాధ్యక్షుడు రషీద్, కార్యదర్శి సుబ్రమణ్యం, గ్యారేజి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఉలవ సాగుకు తరుణమిదే!



సాగులో ఉన్న ఉలవ పంట (ఫైల్)

- వేరుశనగ పంట దెబ్బతిన్న రైతులకు ప్రత్యామ్నాయం
- రాయితీతో విత్తనాల పంపిణీ
- తక్కువ పెట్టుబడితో మూడు నెలల్లోనే పంట చేతికి
- రైతుకు అదనపు ఆదాయంతోపాటు పశువులకు మేత

పలమనేరు: ఖరీఫ్‌లో వేరుశనగను సాగుచేయలేని రైతులు లేదా పంటసాగుచేసి పంటపెట్టుబడికూడా దక్కక నష్టపోయిన రైతులకు ఉలవ సాగు ప్రత్యామ్నాయంగా మారింది. బీళ్లుగా పొలాలున్న లేదా ప్రస్తుతం దుక్కి సిద్ధంగా ఉన్న రైతులు, తయారు చేసుకునేవారు ఉలవ పంటను సాగుచేసుకోవడం చాలా ఉత్తమమని వ్యవసాయశాఖ సూచిస్తోంది.



ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న ఉలవలు

ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు ఉలవ విత్తనాలను సబ్సిడీతో రైతులకు పంపిణీ చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఖరీఫ్‌లో మొదటి పంట తర్వాత వర్షాధారంగా లేదా ఏ పంటలు వేయడానికి అనువుగా లేనప్పుడు ఉలవ సాగు రైతులకెంతో మేలు. ఖరీఫ్‌లో వేరుశనగ, నువ్వులు, గోగు తర్వాత ఏకపంటగానూ రాగి, జొన్న పంటల్లో సహ పంటగానూ ఉలవను సాగుచేయవచ్చు. పంట వడుపుకున్నాక పశువులకు మంచి ఎండు మేతగా కూడా ఉపయోగపడుతుంది.

పంట సాగుకు అనువైన కాలం ఇదే...



అక్టోబర్ నెలలో ఉలవను సాగు చేయవచ్చు. ఎర్ర, నల్ల రేగడి నేలలు పంట సాగుకు అనుకూలంగా ఉంటాయి. పంటకాలం మాత్రం 85 నుంచి వంద రోజులు మాత్రమే. దిగుబడి ఎకరాకు ఆరు నుంచి ఏడు క్వింటాళ్ల వరకు రావచ్చు. విత్తనాలను చల్లే ముందు కిలో విత్తనానికి ఓ గ్రాము కార్బండజిమ్‌ను కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఎకరాకు 12–15 కిలోల విత్తనాలు అవసరముంటుంది. ఎకరాకు నాలుగు కిలోల నత్రజని, పది కిలోల భాస్వరం, ఎనిమిది కిలోల పోటాష్‌నిచ్చే ఎరువులను విత్తే ముందు వేసుకోవాలి. అంతర కృషిగా నాటిన నెలలోపు కలుపు నివారణ చేపట్టాలి. పూత పిందె దశలో కాయతొలుచు పురుగు రావచ్చు. దీని నివారణకు లీటర్ నీటికి ఎండో సల్ఫాన్ రెండు మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి.

అన్నపూర్ణదేవి, సహాయసంచాలకులు, వ్యవసాయశాఖ, పలమనేరు

కొండలలో నెలకొన్న కోనేటిరాయడు

కొండలలో నెలకొన్న కోనేటి రాయడు, కొండలంత వరములు గుప్పెడువాడు అన్న అన్నమాచార్య సంకీర్తనలోని ఆలయం కీలపట్ల గ్రామంలో ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయం కేవలం కీలపట్లలో మాత్రమే ఉంది. సాక్షాత్తు భృగుమహర్షి ప్రతిష్ఠ చేసిన శ్రీవారి శిలా విగ్రహ దర్శనం మహద్భాగ్యం. కోనేటిరాయస్వామి ఆలయ బాధ్యతలు టీటీడీ చేపట్టినప్పటి నుంచి స్వామివారి నిత్య కైంకర్యాలు, గ్రామంలో పచ్చతోరణాలతో అనునిత్యం శోభస్కరం. ఒకసారి కోనేటి రాయస్వామిని దర్శిస్తే మన జన్మ ధన్యం. ఈ ఆలయ ప్రాముఖ్యత గురించి మనం దరం తెలుసుకుందాం.. కోనేటిరాయడిని దర్శించి తరిద్దాం..

– గంగవరం

- కీలపట్లలో కొలువుదీరిన దేవదేవుడి శిలా విగ్రహం
- అతి పురాతన పుణ్యక్షేత్రం
- కొండలలో నెలకొన్న కోనేటిరాయడు ఇక్కడి దేవుడే
- టీటీడీ ఆధ్వర్యంలో నిత్య కైంకర్యాలు



స్వామివారి ప్రతిరూపం,



ఆలయ గోపుర శిఖరం,



స్వామివారి పుష్కరిణి

ఆలయ ప్రస్థానం చారిత్రాత్మకం..

ఆ ఏడుకొండల స్వామి స్వయంగా వెలసిన తిరుమల లాంటి పుణ్యక్షేత్రాల్లో ఒకటి కీలపట్ల శ్రీకోనేటి రాయస్వామి ఆలయం. గంగవరం మండలం కీలపట్ల గ్రామంలో స్వామివారు శ్రీ కోనేటిరాయడుగా వెలసిన ఈ దేవాలయం అతి పురాతనమైన చారిత్రక కలిగిన ప్రసిద్ధి గాంచిన దేవస్థానం. స్వామివారు కోనేటిలో లభించడం వల్ల కోనేటిరాయస్వామిగా పిలుస్తారు. కలియుగంలో పాపప్రక్షాళన గావించేందుకై హరిభక్త కోసం త్రిమూర్తులను పరీక్షించేందుకు వెళ్లిన భృగుమహర్షి శ్రీమహావిష్ణువుని కాలితో తన్నడంతో పాప పరిహారం కోసం మార్గాన్ని సూచించమని మహర్షులను కోరతారు. అప్పుడు కౌండిన్యా మహర్షి సలహా మేరకు ఏడు ప్రాంతాల్లో శ్రీవేంకటేశ్వరస్వామిని భృగుమహర్షి ప్రతిష్టించినట్లు పురాణం. అందులో ఒకటి శ్రీకోనేటిరాయస్వామి ఆలయం. పద్మావతీ దేవిని స్వామివారు పరిణయమాడిన తరువాత సతీసమేతంగా మంగాపురం, కీలపట్ల పరిసరాల్లో పర్యటించారని తెలుసుకున్న మహర్షులు ఇక్కడే కొలువుదీరాలని మహర్షులంతా ఏకమై స్వామివారిని కోరారంట. వాళ్ల కోరిక మేరకు స్వామివారు కీలపట్లలో వెలసినట్టు పురాతన చరిత్రలో ఉంది. అలా స్వామివారిని భృగుమహర్షి స్వయంగా ప్రతిష్ఠ చేసి ఆరాధించగా పాండవ మధ్యముడు అర్జునుని మునిమనవడు జనమేజయ మహారాజు ఇక్కడ స్వామివారికి చిన్నపాటి గుడి కట్టించారని పురాణ చరిత్రలో లిఖించబడి ఉంది. ఆ తరువాత 9, 10 శతాబ్దంలో చోళ, పల్లవ కాలంలో ఆలయాన్ని పునఃనిర్మించారు. విజయనగర సామ్రాజ్యాధీశుల ఏలుబడిలో స్వామివారికి విశేషంగా పూజలందించారు. గతంలో తురుష్కులు హిందూ దేవాలయాలను కొళ్లగొట్టే సందర్భంలో మహమ్మదీయుల దండయాత్రలకు భయపడి ముందుజాగ్రత్తగా ఆలయం పక్కనే ఉన్న పుష్కరిణిలో స్వామివారి మూల విరాట్‌ను దాచారు. అలా వందేళ్లకుపైగా కోనేటి మడుగులో ఉన్న స్వామివారిని విజయనగర రాజుల కాలంలో మూలవిరాట్‌ను బయటకు తీశారు. ఆ తరువాత కాలంలో చంద్రగిరి సంస్థానాధీశుల సామంతులు శ్రీ బోయకొండమనాయుడుకి స్వామివారు కలలో సాక్షాత్కరించి కోనేటిలో ఉన్న మూలవిరాట్‌ను తిరిగి ప్రతిష్ఠించమని కోరారు. ఆవిధంగా స్వామివారు కోనేటిలో నుంచి ప్రతిష్ఠ చేయబడిన కారణంగా శ్రీకోనేటిరాయస్వామిగా అవతరించారు. అన్నమయ్య సంకీర్తనలలోని శ్రీకోనేటిరాయస్వామి ఆలయం ఈ గ్రామంలో మాత్రమే ఉంది. తరువాతి కాలంలో పుంగనూరు జమీందార్లు స్వామివారికి నిత్య కైంకర్యాల కార్యక్రమాల కోసం అవసరమైన మాణ్యాలను సమకూర్చారు. కోరినదే తడవుగా కొండంత వరాలు ప్రసాదించే శ్రీ కోనేటిరాయస్వామికి నిత్య కైంకర్యాలు, ఏటా బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా జరుగుతాయి. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పరవశులవుతారు.

ఒకే పోలికతో మూలవిరాట్లు...

కీలపట్లలో కొలువుదీరిన కోనేటిరాయస్వామి వారు అన్ని విధాలా తిరుమల వేంకటేశ్వర స్వామిని పోలి ఉంటారు. మూల విరాట్లు రెండూ ఒకే విధంగా రూపురేఖలు కలిగి ఉండి గర్భాలయంలో కుడి వైపున శ్రీ వరమహాలక్ష్మి అమ్మవారు కొలువై ఉంటారు. పురాణ శాస్త్ర ప్రకారం తిరుమల ఆలయాన్ని, కోనేటిరాయ స్వామి ఆలయాన్ని ఒకే శిల్పి రూపొందించారని, అందుకే ఈ రెండు ఆలయాలు ఒకే పోలికతో ఉంటాయని పెద్దలు అంటారు. ఆలయంలో కోనేటిరాయస్వామితో పాటు చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, వరాహస్వామి, ఆళ్వార్లను దర్శించుకోవచ్చు. కీలపట్లలో కోనేటిరాయ స్వామిని దర్శించాకే తిరుమలకు వెళ్లాలని భక్తుల విశ్వాసం. ఆలయ పరిసరాల్లో స్వామివారి పుష్కరిణి, ఉద్యానవనం, శ్రీరామాంజనేయ స్వాములు ఆలింగనం చేసుకుంటున్న శిల్పాలు, ఉద్యానవనంలో తాండవ కృష్ణుడు, కళ్యాణవేదిక, ఆనంద నిలయ విమానం, అతి పెద్ద గాలి గోపురం ఉంటాయి. ఈ ఆలయం పలమనేరు పట్టణం నుంచి 7కిలోమీటర్ల దూరంలో కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయం అతి విశాలమైన ప్రదేశంలో దర్శనమిస్తుంది. ఈ క్షేత్రంలో స్వామివారు కోనేటిరాయస్వామిగా భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నారు. గత 12 ఏళ్ల క్రితం గ్రామస్తుల ఆధ్వర్యంలోనే స్వామివారికి చిన్నపాటి పూజాకైంకర్యాలు జరిగేవి. ఆ తరువాత గ్రామస్తుల నిర్ణయంతో ఈ ఆలయ బాధ్యతలు టీటీడీ ఆధీనంలోకి చేరాయి. అప్పటి నుంచి ఆలయాన్ని అభివృద్ధి చేసి స్వామివారికి నిత్య కైంకర్యాలు, వైశాఖ మాసంలో బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాలు వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం అంగరంగ వైభవంగా జరుగుతాయి. ప్రతిరోజూ భక్తజన సందోహంతో కోనేటిరాయడు ఆలయం పరవసిస్తుంది. దేవదేవుని కృపాకటాక్షాలు కలగాలంటే వెంటనే కీలపట్లలో స్వామివారిని దర్శించండి.. తరించండి.

కోరిన వరాలిచ్చే కోనేటిరాయడు..



తిరుమల స్వామివారే ఇక్కడ కోనేటిరాయస్వామిగా వెలిశారు. పూర్వం భృగుమహర్షి చేసిన తప్పిదానికి పాపపరిహారంగా స్వామివారిని కీలపట్లలో ప్రతిష్ఠించారు. ఈ ప్రాంతంలో పల్లవులు పరిపాలించారు కాబట్టి పల్లవ ఏరు పలమనేరుగా పేరు మారింది. అన్నమాచార్య సంకీర్తనలో కోనేటిరాయస్వామిగా ఈ ఆలయం ప్రపంచంలో కీలపట్లలో మాత్రమే ఉంది.

దేవరాజాచార్యులు, ఆలయ అర్చకులు

సేవ చేసే భాగ్యం లభించింది..



టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారి నిత్య కైంకర్యాలు శోభాయమానంగా జరుగుతాయి. రోజూ వందల సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనం కోసం తరలి వస్తున్నారు. ప్రతి శనివారం తిరుమల లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు అందజేస్తున్నాం. స్వామివారి కల్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమాలకు దాతలు ముందుకొస్తున్నారు. కోనేటిరాయడికి సేవ చేసే భాగ్యం లభించడం నా పూర్వజన్మ సుకృతం.

టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర

తుపాన్‌పై ముందస్తు జాగ్రత్తలు

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో తుపాన్ ద్వారా ఎలాంటి ప్రమాదాలు, నష్టం జరక్కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. అలాగే తుపాన్‌పై సమాచారం సేకరించేందుకు మున్సిపాలిటీలో కాల్‌సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే కమిషనర్ సహా అన్నిశాఖల అధికారులకు తెలియజేయాలని సూచించారు. అలాగే పట్టణంలో విద్యుత్ స్తంభాలు, పురాతన కట్టడాలు, కుంటలు, కాలువల వద్దకు ఎవరూ వెళ్లకుండా ఆప్రాంత సచివాలయ ఉద్యోగుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. తుపాన్ తాకిడికి పట్టణ ప్రజలు ఎవరు నష్టపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

తుపాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పలమనేరు: పురపాలకశాఖ సంచాలకుల ఆదేశాల మేరకు తుపాన్ నేపథ్యంలో పలమనేరు మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మంగళవారం ఈ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో కాపురాలుంటున్న వాళ్లకి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వర్షం కారణంగా ఎవరికైనా ఇబ్బందులంటే 08579–252217 అనే నంబర్‌కు ఫోన్ చేయాలని ప్రకటనలో సూచించారు.